ఉగాది పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

# చిన్నబోదా చిన్ని ప్రాణం

- వారణాసి నాగలక్ష్మి



**న్యూజెర్సీ నుండి డాక్టర్ మయూర్ ఇ మెయిల్‌తోపాటు పంపిన ఫొటోని సంభ్రమంగా మరోసారి చూసి, కంప్యూటర్ 'షట్ డౌను' చేసింది డాక్టర్ ప్రతిభ. టైమ్ చూసుకుంది. రాత్రి తొమ్మిదవుతోంది. ఇంక క్లినిక్ మూసేయచ్చు అనుకుంటూ టేబిల్ మీది కళ్ళజోడు, సెల్‌ఫోను హాండ్‌బాగ్‌లో పెట్టుకుంది.**

*అలసటగా లేవబోతుంటే గుమ్మందగ్గర ఎవరో కదిలినట్టు అనిపించింది. లేత నీలి రంగు చేనేత చుడీదార్ కుర్తాలో ఓ పాతికేళ్ళ అమ్మాయి సంకోచంగా చూస్తూ 'నమస్తే డాక్టర్' అంది. చక్కని ఆకృతి వచ్చి కూర్చోమన్నట్టుగా చేత్తో సూచిస్తూ కుర్చీలోంచే టేబుల్ దగ్గరగా జరిగింది ప్రతిభ. క్షణకాలంలోనే ఆమె మొహంలోని అలసట మాయమై సునిశిత పరిశీలనా వీచిక కదలాడింది.*

ఇరవయ్యేళ్ళుగా అలవాటైపోయిందలా...! పేషెంట్ రాగానే 'డాక్టర్ ప్రతిభ'గా మారడం!

నెర్వస్‌గా దుపట్టా సర్దుకుంటూ కుర్చీలో కూర్చోబోతున్న యువతిని గమనింపుగా చూసింది. వెంట ఎవరూ వచ్చినట్టు లేదు! విశాలమైన సోగ కళ్ళూ, వంపు తిరిగిన పెదవులూ, సూటి ముక్కూ... మొహం నిండా పలుచని తెరలా పరుచుకున్న ఆందోళన. ఎలా మొదలుపెట్టాలో తెలియనట్టుగా కుర్చీలో కదులుతూ ప్రతిభవైపు చూసింది.

"చెప్పమ్మా! నీ పేరు?" అడిగింది ప్రతిభ.

చెప్పనా వద్దా అన్నట్టు చలించే కళ్ళతో ఆమెని చూసి, తన చేతి వేళ్ళవైపు దృష్టి మరల్చిందామె. గట్టిగా ఊపిరి పీల్చుకుని ఏదో చెప్పబోయే లోపు ప్రతిభ బాగ్‌లోని సెల్‌ఫోను ఒకసారి మోగి ఆగిపోయింది. 'ఇంక బయల్దేరుదామా?' అన్న సంకేతం అది. ప్రక్క క్లినిక్‌లో ఆమె భర్త సూర్యం నుంచి. ఫోను తీసి 'పది నిముషాలు' అని ఎస్సెమ్మెస్ పంపించి, "చెప్పమ్మా" అంది ప్రతిభ. ఎపుడూ తనే ఆలస్యం. పేషెంటుని తరుముతున్నట్టు ట్రీట్ చెయ్యడం తన పద్ధతి కాదు. ఆ విషయంలో తనకీ సూర్యానికీ వివాదాలు చోటుచేసుకుంటాయి.

అతని క్లినిక్‌లో అడుగుపెట్టింది ముద్దొచ్చే చిన్నపిల్లలైనా, తండ్రి వయసున్న ముసలివాళ్ళైనా అతని మొహంలో స్నేహపూర్వకమైన చిరునవ్వు కనపడదు. తన కళ్ళద్దాల వెనకనుంచి "ఇక్కడికెందుకు వచ్చారో త్వరగా చెప్పండి" అన్నట్టు చూస్తాడు! చెప్పిందే మరోసారి చెప్పబోయినా, అనవసరమైన వివరాలు ఇవ్వబోయినా ఎక్కువైన బట్టని టైలర్ కత్తిరించినట్టు కత్తిరించేస్తాడు! అసమ్మతిగా నవ్వుకుంటూ "చెప్పమ్మా" అంది మళ్ళీ.

అంతవరకు గోడ మీది పోస్టర్‌నే చూస్తూ సందిగ్ధంలో ఉన్న యువతి ప్రతిభ చేతిలోని ప్రిస్క్రిప్షన్ పాడ్ వైపు దృష్టి మరల్చి "డాక్టర్! నాకిప్పుడు మూడోనెల" అంది హఠాత్తుగా.

"ఊ... కంగ్రాట్స్! పేరు చెప్పమ్మా" అంది ప్రతిభ నవ్వుతూ.

ఆమె ప్రశ్న విననట్టుగా "ఈ పరిస్థితిలో ఎబార్షన్ చెయ్యచ్చా?" అడిగింది సూటిగా. అంతసేపటి తాత్సారం ఏమైందో.

పరిశీలనగా ఆమెని మరోసారి చూస్తూ "అంత మంచిది కాదు. కానీ ఎందుకు?" మృదువుగా అడిగింది ప్రతిభ.

ఆమె తల వంచుకుని చేతి గోళ్ళమీద దృష్టి నిలిపి ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది.

"పెళ్ళి కాలేదా?" ఆమె చేతిమీద చెయ్యి వేసి అడిగింది.

చటుక్కున కళ్ళెత్తి విరక్తిగా నవ్వుతూ "అయింది డాక్టర్! పెళ్లై ్ళంది" అంది ఆఖరి పదాన్ని నొక్కి పలుకుతూ.

"మరి?" స్నేహపూర్వకంగా అడిగింది ప్రతిభ.

మళ్ళీ మౌనంగా పెదవి కొరుక్కుంది ఆమె.

"అపుడే వద్దనా?"

తల అడ్డంగా ఊపింది అదీ కాదన్నట్టు.

"మొదటి ప్రెగ్నెన్సీనా?"

అవునన్నట్టు తలూపింది.

"అతనికి ఇష్టం లేదా?" వెంట ఆమె భర్త రాకపోవడాన్ని తలుచుకుంటూ అడిగింది.

"అతనికి ఇష్టమే."'

"మరేమిటమ్మా?" కంఠంలో విసుగు ధ్వనించకుండా జాగ్రత్తపడుతూ అడిగింది ప్రతిభ.

"చెప్పి తీరాలా డాక్టర్? మీరు చేస్తానంటే చెప్తాను. మీరు చెయ్యని పక్షంలో నా వివరాలన్నీ చెప్పి ఏం లాభం?" భావోద్వేగంతో కందిన మొహం. ఏదో బాధతో మెరుస్తున్న కళ్ళు, సంకోచం పోయి మొండితనం ఆవహించినట్టున్న తీరు... ప్రతిభ ఒక్క క్షణం నిరుత్తరురాలైంది.

తేరుకుని, "కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప ఎబార్షన్ చెయ్యకూడదమ్మా. అదీ మొదటి ప్రెగ్నెన్సీ అయితే అసలు మంచిది కాదు" కారణం చెప్పాల్సిందే అన్నట్టు సూచిస్తూ అంది ప్రతిభ. ఎలా చెప్పనా అన్నట్టు ఆమె ప్రతిభ వైపు చలిస్తున్న కళ్ళతో చూసింది. ప్రతిభలో మాతృభావం పొంగింది. మరో పదేళ్ళకి తన కూతురు ఇలా ఉంటుందేమో!

ఒక క్షణం మౌనం తర్వాత "అతని బిడ్డ కాదా?" అడగబోయింది ప్రతిభ. ఆ ప్రశ్న పూర్తయ్యేలోపే "ఛీ" ఎర్రబడ్డ మొహంతో అది కాదన్నట్టు తల తిప్పింది.

"చూడమ్మా! నీ వివరాలన్నీ చాలా కాన్ఫిడెన్షియల్‌గా ఉంటాయి. డాక్టర్‌కి తప్పనిసరిగా తెలియాల్సినవే నేను అడుగుతున్నాను. అవి చెప్పాలని లేకపోతే ఈ 'కన్సల్టేషన్' అనవసరమే" సౌమ్యంగా అయినా ఖచ్చితంగా అంది ప్రతిభ.

బిగపట్టిన పెదవులూ, వాలిన కళ్ళూ, కాసేపటి సందిగ్ధత తర్వాత ఏదో నిర్ణయానికి వచ్చినట్టు "సరే చెప్తాను డాక్టర్! అతను చాలా... చాలా సెల్ఫిష్. మా పెళ్ళై మూడేళ్ళయింది. ఇద్దరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా ఉద్యోగాలు చేస్తున్నాం. వాళ్ళింట్లో మగవాళ్ళు ఇంటి పనుల్లో వేలు కూడా పెట్టరు. అలా పెరిగాడు. ఎప్పుడూ తన ఉద్యోగం, తన జీతం, తన సరదాలూ, తన స్నేహితులూ... అంతే. అతని అవసరాలకే నేను! ఇంట్లో ఏమీ పట్టించుకోడు. మొదట్లో ఇద్దరం ఒకటే అనే భావంతోనూ, నా మొగుడనే ప్రేమతోనూ అన్ని పనులూ నేనే చేస్తూ వచ్చాను. ఆఫీసు నుంచి వస్తూ వంట సామాన్లూ, సరుకులూ, కూరలూ నేనే కొనుక్కురావడం, నేనే కొంటున్నాను కనుక నా జీతమే ఖర్చుపెట్టడం జరిగేది. రానురాను అతని స్వభావం అర్థమైంది. రోజువారీ పనులన్నీ ప్రాముఖ్యత లేనివే అతని దృష్టిలో. కాఫీ, టిఫిన్, లంచ్, డిన్నర్ అన్నీ కావాలి గాని, అవి ఎలా టేబుల్ మీదికి వస్తున్నాయో అతనికి పట్టదు. తన కన్వీనియెన్స్ కోసం పెళ్ళిచేసుకున్నాడు, కలిసి జీవిస్తున్నాడు. తన జీతం బాంక్‌లో పెరుగుతూంటుంది. ఇంటి ఖర్చుకి కావలసిన సంపాదనా నాదే. ఇంటి పనీ నాదే. ఇపుడు ఒక 'మొమెంట్ ఆఫ్ ప్లెజర్' ఫలితంగా పుట్టబోయే బిడ్డని మోసేదీ, కనేదీ, పెంచేదీ నేనే... ఏదో... ఒకలాంటి శూన్యం మనసంతా! ఏదో చెప్పలేని బాధ. చెప్పలేని 'యాంగ్జయిటీ'... "క్లుప్తంగా ఎలా చెప్పాలో తెలియనట్టు తడుముకుంది. తలొంచుకుని కంటి చివర ఆగిన కన్నీటి బిందువుని సుతారంగా విదిలించింది.

ప్రతిభ మనసులో సానుభూతి కదిలింది. ఆమె చేతిని తన చేతితో నొక్కి వింటున్నానన్నట్టు తలాడించింది.

"నాకిపుడు ఇరవై ఆరేళ్ళు. ఇద్దరం బానే సంపాదిస్తున్నాం. చూసే వాళ్ళంతా 'మేడ్ ఫర్ ఈచదర్' అంటారు. ముప్ఫైదాటేలోపు ఇద్దరు పిల్లల్ని కనాలనుకున్నాను. లేటైతే డెలివరీలు నార్మల్‌గా అవవంటారు కదా!" ప్రశ్నార్థకంగా చూసింది. అవునన్నట్టు తలూపింది ప్రతిభ.

"మొదటి రెండేళ్ళూ అపుడే వొద్దనుకున్నాం. కావాలనుకున్నాక ఏదో ఆదుర్దా. కొంతమంది పిల్లలు కలగని వాళ్ళని చూసి భయం కలిగేది నాకూ పుట్టరేమో అని. నెలంతా ఏదో ఎదురుచూపులు. పీరియడ్స్ స్టార్టవగానే ఏదో నిరాశ. అలాంటిది కిందటి నెల పీరియడ్ 'మిస్'కాగానే ఏదో చెప్పలేని థ్రిల్... సంతోషం! పవన్ కూడా చాలా 'డిలైట్' అయిపోయాడు. ఓ వారం రోజులు ఉల్లాసంగా గడిచింది. అంతే మళ్ళీ మామూలు. అతనిలో ఏదో మార్పు ఆశించానేమో... చాలా నిరాశ కలిగింది. ఏదేనా ముద్దుమురిపాలు కాదుగదా కనీసం డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలని కూడా అతనికి తోచలేదు. రెండుసార్లు నేనే అడిగాను. 'ఏముంది సుజా పెద్ద? మెయిన్‌రోడ్‌లోనే గైనకాలజిస్ట్ ఉన్నారుగా. సాయంత్రం వచ్చేపుడు చూపించుకొచ్చెయ్'అన్నాడు. నాకు చాలా దుఃఖం వచ్చింది. సంసారంలో మార్పులొచ్చినా అతనిలో మార్పురాదని తెలిసింది."

## పరిచయం



కృష్ణా జిల్లా నూజివీడులో పుట్టి పెరిగాను. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ నుంచి కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ, ఎం.ఫిల్. చేశాను. భర్త ఇ.ఎన్.టి. స్పెషలిస్ట్. 1980నుండి కథలు, లలిత గీతాలు, కవితలు రాస్తున్నాను. మొదటి కథ 'పాప ఫలాంత వైభవం' ఆంధ్రప్రభలో ప్రచురితమైంది. తర్వాత విపుల, స్వాతి, నవ్య, రచన, ఆంధ్రభూమి వంటి వార మాస పత్రికలలోనూ, కౌముది, సుజన రంజని వంటి వెబ్ పత్రికలలోనూ నా కథలూ, కవితలూ ప్రచురితమయ్యాయి. సిలికానాంధ్ర- రచన సంయుక్తంగా నిర్వహించిన గీత రచన పోటీలలోనూ, కథల పోటీలోనూ బహుమతులు లభించాయి. 2007 ఉగాది సందర్భంగా 'కౌముది' వెబ్ మాస పత్రిక నిర్వహించిన కథల పోటీలో 'అమృతాన్ని సాధించు' కథకి ప్రథమ బహుమతి లభించింది. రేడియోలోనూ, టీవీలోనూ నా లలిత గీతాలు ప్రసారమయ్యాయి. చిత్రలేఖనం కూడా నాకు ఎంతో ఇష్టమైన హాబీ. రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ లండన్‌లో నా చిత్రం 'బ్లూన్ అండ్ బ్లూమ్స్' ప్రదర్శించబడడం ఒక మరపురాని అనుభవం.

**- వారణాసి నాగలక్ష్మి**

అదిరే ముక్కుపుటాలు, ఎర్రబడ్డ మొహం... ఆగి బాగ్‌లోంచి రుమాలు తీసి కళ్ళు, ముక్కు తుడుచుకుంది.

"చివరికి నా ఫ్రెండ్‌తో వెళ్ళి, మా కాలనీలో డాక్టర్‌కి చూపించుకున్నాను. ఆరు వారాలైందన్నారు. అంతా నార్మల్‌గా ఉందని, ఏవో సూచనలిచ్చారు. మళ్ళీ నెలకి రమ్మన్నారు. డాక్టర్ దగ్గరకి వెళ్ళావా లేదా అని కనుక్కోలేదు. వెళ్ళానని నేనే చెపితే 'అంతా నార్మలేనా? వెరీ గుడ్!'అన్నాడంతే. నా శరీరకమైన మార్పులూ, ఇబ్బందులతో తనకేం సంబంధం లేనట్టుంటాడు. వేవిళ్ళు ఎక్కువై రాత్రిపూట వాంతులు చేసుకుంటుంటే కనీసం ఆప్యాయంగా ఆదరంగా ఉండడు. ఏమన్నా కావాలా అని కనుక్కోడు. 'ఏవేనా టాబ్లెట్స్ అడుగు డాక్టర్‌ని' అంటాడు విసుగ్గా. నెల రోజులుగా ఒకటే 'నాసియా'. కొన్ని రోజులు ఆఫీస్‌కి కూడా వెళ్ళలేకపోయాను. 'రెస్ట్ తీసుకో'అనేసి పొద్దున్న వెళ్ళిన మనిషి, రాత్రెపుడో లేటుగా రావడం, వర్కెక్కువగా ఉందని కుంటిసాకులు నాకు తెలుసు... నా నీరసం మొహం చూడడం, ఇలాంటపుడు తోడుగా ఉండడం అతనికి బోర్. నాకు కళ్ళనీళ్ళొస్తే అతనికి చిరాకు. ఇన్నాళ్ళూ రకరకాల వంటలూ, టిఫిన్లూ చేసి నోటికందిస్తే తిని ఎంజాయ్ చేసిన మనిషికి, ఏమీ సయించక ఆకలితో భార్య పడుకుని ఉంటే అంత 'ఇండిఫరెన్స్' ఏమిటని ఏడుపొస్తోంది! ఒంట్లో నిస్సత్తువగా ఉన్నపుడు అతను ప్రేమగా పలకరించాలని, కాసేపు నా మనసు తేలికపడేలా కబుర్లు చెప్పాలని ఉంటుంది కదా. ముఖ్యంగా ఇలాంటపుడు? మొన్న నిలదీసి అడిగితే నాకు వంటరాదు సుజా! డబ్బు పారేస్తే అన్నీ దొరికే రోజుల్లో ఆఫీసులోనూ అలిసిపోయి, ఇంట్లోనూ అలిసిపోయి... ఎందుకు అవస్థ? అన్నాడు.

నాకూ చాలా ఉక్రోషం వచ్చి, 'సరే. నాకు మాత్రం వేవిళ్ళతో ఈ అవస్థ ఎందుకు? ఎవరైనా అనాథని పెంచుకుందాం' అన్నాను. నన్ను పురుగుని చూసినట్టు చూశాడు. 'నీకేం పిచ్చా? అదీ ఇదీ ఒకటేనా? నీకక్కర్లేకపోయినా ఐవాంట్ ఎ సన్! మై ఫ్లెష్ ఎండ్ బ్లడ్'అని చేతిలో పుస్తకం గిరాటేసి వెళ్ళిపోయాడు. తలొంచుకుని రుమాలు తిప్పుతూ ఉండిపోయింది.

"మరి ఇన్ని రోజులు ఆలస్యం చేశావేం?"

"అపుడు కూడా అబార్షన్ గురించి అనుకోలేదు డాక్టర్. ఏదో బాధ... చెప్పలేని బాధ కలిగింది గాని, ఈ ఆలోచన రాలేదు. నాతో డాక్టర్ దగ్గరకొచ్చిన ఫ్రెండ్‌తో చెప్పుకున్నాను 'డిప్రెస్డ్'గా అనిపించి. వాళ్ల అక్కకి కూడా ఇలాగేట! ఎంతో చదువుకున్నా, ఇద్దరు పిల్లల్ని కనిపెంచడంలో అతని సహకారం ఏమీ లేక, ఉద్యోగం మానేసి ఇంటికే అంకితమైపోయిందిట! వాళ్లని పెంచడం, చదివించడం, వాళ్ల ఇతర బాధ్యతలూ అంతా ఆవిడే చూసుకోవాలిట. ఆర్థికంగా పూర్తిగా అతని మీద ఆధారపడిపోయి, అతని అనుమతి లేనిదే స్వతంత్రించి ఏ పనీ చెయ్యలేని స్థితికి వచ్చేసిందిట. అది తెలిశాక నాకు తిక్కతిక్కగా ఉంది."

"అతనితో నీ భావాలు మెల్లిగా వివరించి చెప్పకపోయావా?"

"హుఁ" విరక్తిగా నవ్వింది సుజా." చెప్పాను. లీవ్ పెట్టి అమ్మ దగ్గరకి వెళ్ళమన్నాడు. 'స్టాప్ బీయింగ్ సిల్లీ' అన్నాడు.

"......."

"అందుకే చాలా ఆలోచించాను. పెళ్ళిచేసుకుని, ఒకరినొకరు అర్థంచేసుకోకముందే పిల్లల్ని కనేసి, విడాకుల దాకా వెళ్ళి పిల్లల్ని బాధపెట్టలేక, కలిసి ఉండనూ లేక అవస్థలు పడేవాళ్ళని చూసి ఎంత మూర్ఖులో అనుకునే దాన్ని! ఇపుడు నా పరిస్థితీ అలానే ఉంది ఆంటీ... సారీ... డాక్టర్!" అంటుంటే ఆమె కళ్ళు నిండుకున్నాయి.

ప్రతిభ జాలిగా చూసింది. ఇంతలో సెల్‌ఫోను మళ్ళీ మోగి, ఆగింది. ప్రతిభ ఫోన్ తీసి, సూర్యం నంబర్ నొక్కింది. "ఇంకా ఎంతసేపు ప్రతిభా!" నిశ్శబ్దంగా ఉన్న క్లినిక్‌లో అతని గొంతు సెల్‌ఫోన్లోంచి సన్నగా వినిపించింది.

"ఒక్క అయిదు నిముషాలు సూర్యం!"

"ఇంకానా?"

"సారీ... అనుకోకుండా ఓ ఫ్రెండ్..." అభ్యర్థనగా అంది.

"సర్లే కానివ్వు. పది నిముషాల్లో నా క్లినిక్ లాక్ చేసి, కార్లో వెయిట్ చేస్తుంటా" సగం సగం వినిపిస్తున్న మాటలకి విషయం అర్థమై, తనవల్ల ఆలస్యం అయిందని కించపడుతూ కళ్లు తుడుచుకుని "సారీ డాక్టర్" అంది సుజా.

"అయ్యో! పర్లేదమ్మా... చెప్పు మరి ఏం చేద్దాం? నీ పరిస్థితి నాకర్థమైంది. కానీ ఈపాటికి పాపాయి కాళ్ళూ చేతులూ తయారవుతూ ఉంటాయి. 'ఫస్ట్ ట్రై మిస్టర్'లో ఇలాంటి నిస్సహాయతా, డల్‌గా అనిపించడం, ఏమీ సయించక నీరసం కలగడం, (మిగతా 20వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

'ఇమోషనల్ అప్స్ ఎండ్ డౌన్స్' చాలామందిలో ఉంటాయి. ఇందుకే పాపాయి వొద్దనుకోడం సరికాదమ్మా. మొదటి గర్భం తీయించేసుకుంటే మళ్ళీ రాకపోవచ్చు కదా!"

"పర్లేదు డాక్టర్! నాకసలు పిల్లల్ని కనాలనే లేదు!"

నవ్వింది ప్రతిభ. "ప్రసూతి వైరాగ్యం అన్నమాట విన్నావా? ఇదేదో వేవిళ్ళ వైరాగ్యం లాగా ఉంది. పిల్లల్ని కనాలని లేకపోతే పీరియడ్స్ రాగానే ఎందుకంత నిరాశ పడ్డావు?" సుజా కళ్ళలోకి చూస్తూ ఒక క్షణం ఆగి, "నువు కొంచెం నిబ్బరం, కాస్త సూటిదనం, గట్టిదనం నేర్చుకుంటే పరిస్థితిని చక్కగా నీ కంట్రోల్‌లోకి తెచ్చుకోగలవు" అంది.

తల అడ్డంగా ఊపుతూ "లేదు డాక్టర్! ఇప్పటికే ఆలస్యం చేశాను. మీరనే పాజిటివ్ మార్పులేవీ నా సంసారంలో వచ్చే అవకాశం లేదు. పొద్దున్నే చెప్పాను. 'డాక్టర్ దగ్గరకెళ్ళాలి సాయంత్రం' అని. ఇంత రాత్రయింది. 'భార్య ఇంకా ఇల్లు చేరలేదు... ఒంట్లో ఎలా ఉందో' అనే ఆలోచన ఉందా అతనికి? మొబైల్‌కి కాల్ వస్తుందేమో అని ఎదురు చూశాను ఇప్పటిదాకా. ఊహుఁ... హి ఇజ్ టూ సెల్ఫిష్ టు కేర్ ఫర్ ఎనీవన్ ఎల్స్!"

మెల్లిగా తలాడించి "ఈ పరిస్థితికి మూల కారణం ఏమిటో ఎపుడేనా ఆలోచించావా సుజా! ఈ తరం పిల్లలు ఇలా పెరగడానికి కారణం నాకు తెలుసు. పోటీ ప్రపంచంలో తమ బిడ్డ ఎంత ముందుకు వెళ్ళగలడా అనేదానిమీదే తల్లిదండ్రుల దృష్టి ఉంటోంది. తమ పిల్లల్ని, ముఖ్యంగా మగ పిల్లల్ని సమస్త సౌకర్యాలూ అమర్చాం! కేవలం మార్కులు, రాంకులు మాత్రం అద్భుతంగా తెచ్చుకోమని తల్లిదండ్రులు నూరిపోస్తున్నారు. ఎక్కువ...ఇంకా ఎక్కువ జీతాలు తెచ్చుకునే ప్రొఫెషన్స్ వైపు, ఉద్యోగాల వైపు తరుముతున్నారు. మానవ సహజమైన సంబంధాలకోసం, వాటిని పెంపొందించుకోవడం కోసం ఏ ప్రయత్నం జరగడం లేదు! బంధువులు గాని, స్నేహితులు గాని వస్తే పిల్లాడు 'డిస్టర్బ్' అయిపోతాడు, వాడి టైం వేస్టయిపోతుంది అని కంగారుపడి, చిరాకు పడే ఇళ్ళలో సంబంధ బాంధవ్యాలు ఏం గొప్పగా ఉంటాయి? ఇంట్లో పరిస్థితులు ఎలా ఉన్నా, తాము తల్లకిందులైనా సరే పిల్లాడికి ఇబ్బంది కలగకూడదని వాడినొక 'ఐసొలేటెడ్ సెల్'లో ఉంచి, చదివిస్తున్నారు తల్లిదండ్రులు! తల్లి జ్వరంతో పడుకుని ఉంటే కొడుకు కాస్త కాఫీ కలిపివ్వడమో, బ్రెడ్ కాల్చిపెట్టడమో ఎక్కడన్నా జరుగుతోందా? పెళ్ళికాగానే భార్యకి మాత్రం అవన్నీ చెయ్యాలని అతనికెలా తోస్తుంది? కాస్త ఊహ తెలిసినప్పటినుంచి ఈ 'కాంపిటీటివ్ వరల్డ్'లో నీకేది 'అడ్వాంటేజియస్'గా ఉందో అదే చెయ్యమని నూరిపోసి, దాన్నే 'బీయింగ్ స్మార్ట్'అని నిర్వచించి, పాతికేళ్ళ వయసొచ్చాక దాన్ని స్వార్థం అంటే ఎలా? సైన్సూ, మాథ్సూ, కంప్యూటర్స్... ఇవే తప్ప సాహిత్యం ఇష్టంగా చదివే పిల్లలు, యువకులు ఏరీ? ఎంతసేపూ తనగోలే తప్ప, మరొకరి దృష్టికోణాన్ని అర్థంచేసుకునే ప్రయత్నం ఏదీ? ఏదో గుర్తొచ్చినట్టు టైం చూసుకుని, "మనం మళ్ళీ కలుసుకుందాం తల్లీ. నేనిక వెళ్ళాలి. నీ ఇ మెయిల్ అడ్రస్ ఇస్తే నేనొక అద్భుతమైన ఫొటో నీకు పంపిస్తా! అది చూశాక రేపో ఎల్లుండో ఒక్కసారి క్లినిక్‌కి రా... కొంచెం పెందరాళే..."

"సరేనా?" లేచి నిలుచుంటూ అంది ప్రతిభ.

సుజా కూడా నిలుచుంది. ప్రతిభ అందించిన చిన్న కాగితం మీద తన ఇ మెయిల్ అడ్రస్ రాసి, బాగ్ తెరిచింది డాక్టర్ ఫీజు ఇవ్వాలని. ప్రతిభ ఆమెను వారిస్తూ "మళ్ళీ వచ్చినపుడు తీసుకుంటాలే... ఉండనీ" అంది, సూర్యం అసహనాన్ని తలుచుకుని, తొందరపడుతూ. అంతలోనే ప్రతిభ సెల్‌ఫోను రెండుసార్లు మోగి, ఆగింది.

★★★

రోజంతా పనితో బిజీగా ఉన్నా ప్రతిభ మాటలు సుజా మనసులో తిరుగాడుతూ ఉన్నాయి. ఆవిడతో అంతసేపు మాట్లాడుతూ ఉండిపోవడం, ఆలస్యం చేసి ఆవిడ భర్తనీ ఇబ్బంది పెట్టడం తలుచుకుని కొంచెం సిగ్గుపడినా, అలా తన బాధ ఆవిడతో చెప్పుకోడంవల్ల మనసు కొంచెం తేలిక పడ్డట్టనిపించింది ఒక అపరిచితురాలైన బిజీ డాక్టర్‌తో సైకియాట్రిస్ట్ కన్సల్టేషన్‌కి వెళ్ళినట్టు తన బాధంతా చెప్పుకోవడం ఏమిటి? ఆలోచిస్తూ కంప్యూటర్ మీద చేస్తున్న పని ఆపి, తన 'పర్సనల్ మెయిల్' చూడాలని మెయిల్ బాక్స్ ఓపెన్ చేసింది.

అయిదారు కొత్త మెయిల్స్ మధ్య నీలిరంగు అక్షరాలతో 'అమేజింగ్ పిక్చర్ ఆఫ్ ది ఇయర్'అనే సబ్జక్ట్‌తో ఒక మెయిల్ కనిపించింది. డాక్టర్ ప్రతిభ నుంచి! ఆత్రంగా దానిమీద క్లిక్ చేసింది.

ప్రియమైన సుజా!

నీ పేరు చెప్పలేదుగా. సుజా అంటే సుజాత అనుకున్నాను. అంటే మంచి పుట్టుక గలది అని అర్థం. అది నీకు వర్తిస్తుందనిపిస్తోంది. మరో మంచి పుట్టుక గురించిన ఫొటో, దాని వెనుకున్న కథ (నిజంగా జరిగిన సంఘటన) పంపిస్తున్నాను. చదివి నీ అభిప్రాయం తెలియజెయ్యి.

శుభాకాంక్షలతో
ప్రతిభ ఆంటీ.

సుజా పెదవులు విచ్చుకున్నాయి 'ఆంటీ' అని చదవగానే. నిన్న మాటల్లో అప్రయత్నంగా 'ఆంటీ' అన్న పిలుపు తన నోటి వెంట రావడం గుర్తుంచుకుని, అదే విధంగా ప్రతిస్పందించడం మనసుని తాకింది.

'ఇలాంటి డాక్టర్లుకూడా ఉంటారన్నమాట!' ఆలోచిస్తూ 'ఎటాచ్‌మెంట్' మీద క్లిక్ చేసింది.

ఏదో సర్జరీ తాలూకు ఫొటో కంప్యూటర్ తెర మీద కనిపించింది. సర్జన్ రెండు చేతుల వేళ్ళూ కనిపిస్తున్నాయి అటూ ఇటూ. మధ్యలో ఒక బుజ్జి పిడికిలి. చాలా చంటి పాపది. వింతగా ఉన్న ఆ ఫొటో పరీక్షగా చూసి దాని కింద రాసినది చదివింది.

'ఈ సంవత్సరపు నమ్మశక్యం కాని ఫొటో.'

ఇది శామ్యూల్ అలెగ్జాండర్ అర్మాస్ అనే ఇరవైఒక్క నెలల గర్భస్థ శిశువు ఫొటో! తల్లి గర్భంలో ఉన్న ఆ శిశువుపై జోసెఫ్ బ్రూనర్ అనే శస్త్ర వైద్యుడు ఆపరేషన్ చేస్తుండగా తీసిన ఫొటో. ఈ శిశువుకు 'స్పైనాబైఫిడా'అనే వ్యాధి ఉందని నిర్ధారించారు. తల్లి గర్భంనుంచి విడదీస్తే ఆ శిశువు బతకదు! ఆ తల్లి జూలీ అర్మాస్ అట్లాంటాలోని ఒక ఆసుపత్రిలో ప్రసూతి విభాగంలో నర్స్‌గా పనిచేస్తోంది. ఆవిడకి డాక్టర్ బ్రూనర్ శస్త్రచికిత్సా నైపుణ్యం అద్భుతమైనదని తెలుసు. నాష్‌విల్లీలో ఉన్న వాండర్ బిల్ట్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్‌లో ఆయన ప్రాక్టీస్ చేసేవాడు. 'సి' సెక్షన్ ద్వారా తల్లి గర్భకోశాన్ని కోసి, చిన్న 'ఇన్‌సిషన్' ద్వారా గర్భంలో ఉన్న శిశువుకి ఆపరేషన్ చేసేవాడు. ఈసారి అయిదు నెలల గర్భస్థ శిశువు శామ్యూల్‌పై సర్జరీ చేయడం పూర్తికాగానే ఒక అద్భుతం జరిగింది. సర్జరీ పూర్తికాగానే, ఇంకా పుట్టని శామ్యూల్, తల్లి గర్భానికి చేసిన చిన్ని ఇన్‌సిషన్ (కోత)లోంచి, తన బుజ్జి చేతిని బయటికి పెట్టి, డాక్టర్ బ్రూనర్ వేలిని గట్టిగా పట్టుకున్నాడు! ఆ క్షణాన్ని, 'తన జీవితంలోకెల్లా అత్యంత ఉద్వేగ భరితమైన క్షణం'గా వర్ణించాడు డాక్టర్ బ్రూనర్!! ఆ క్షణం తను నిశ్చేష్టుడై, నిశ్చలుడైపోయానని ఆయన చెప్పుకున్నాడు!

ఈ ఫొటోలో ఆ అద్భుతం స్పష్టంగా కనిపిస్తోంది చూడండి!★ ఈ ఫొటోని ప్రచురించిన వార్తాపత్రిక ఎడిటర్ దీనిని ఆశాహస్తం (హాండ్ ఆఫ్ హోప్)గా వర్ణించాడు. ఆ ఫొటో కింద ఇలా రాశాడు...

"21 వారాల గర్భస్థ శిశువు శామ్యూల్ అలెగ్జాండర్ అర్మాస్, తల్లి గర్భంలోంచి తన చేతిని బయటికి పెట్టి, 'జీవితాన్ని వరంగా ఇచ్చినందుకు మీకు కృతజ్ఞుణ్ణి' అని చెపుతున్నట్టుగా, డాక్టర్ బ్రూనర్ చేతిని పట్టుకున్నాడు!"

కొన్నాళ్ళకి శామ్యూల్ సంపూర్ణారోగ్యంతో పుట్టాడు. ఆ సర్జరీ నూరు శాతం విజయవంతమైంది. ఇపుడు మళ్ళీ ఆ ఫొటో చూడండి. ఇదొక సంభ్రమం! ఇదొక అద్భుతం! దీన్ని ఇతరులకి పంపండి. ప్రపంచమంతా దీన్ని చూడాలి!"

పూర్తిగా లీనమై ఏకబిగిన అంతా చదివి మంత్రముగ్ధలా ఆ ఫొటోకి కళ్ళప్పగించింది సుజా. ఈసారి జూలీ అర్మాస్ గర్భకోశం, దానిమీద డాక్టర్ చేసిన చిన్న ఇన్‌సిషన్, డాక్టర్ చేతి వేళ్ళూ స్పష్టంగా కనిపించాయి. ఆ చిన్ని కోతలోంచి బయటికి వచ్చి శామ్యూల్ ముద్దులొలికే బుజ్జి చేయీ, డాక్టర్ చేతిని కృతజ్ఞతలు చెపుతున్నట్టుగా పట్టుకున్న తీరూ... ఆమె గుండెకి గాలం వేసినట్టైంది. అప్రయత్నంగా ఆమె చెయ్యి తన పొట్టని తడిమింది. మరుక్షణం ఆమె కళ్ళు వర్షించాయి. ఇంటికి వెళ్ళాక కూడా ఆ ఫొటో సుజాని వెంటాడింది. రాత్రి నిద్రలో ఒక కల. ఒక పాప తన బుజ్జిచేతులతో ఆమె మొహాన్ని పట్టుకుని, కళ్ళలో నక్షత్రాల మెరుపులు కురిపిస్తూ బోసి నవ్వు నవ్వుతోంది! అంతలోనే పువ్వులాంటి ఆ చేతితో అమ్మ కన్నీరు తుడుస్తోంది!

మెలకువ వచ్చాక సుజాకి ఎంతో ఉల్లాసంగా అనిపించింది. మనసంతా తేలికగా, ఏదో పెద్ద బరువు దిగివడమే కాక, అనుకోని చేయూత దొరికినట్టుగా అనిపించింది! ఆఫీసుకి వెళుతూనే తిన్నగా తన కంప్యూటర్ ఆన్‌చేసి, ఇ మెయిల్ బాక్స్ ఓపెన్ చేసింది. డాక్టర్ ప్రతిభ మెయిల్ మరోసారి చదివి, రిప్లై నొక్కింది.

'థాంక్యూ డాక్టర్! థాంక్యూ సోమచ్! నిన్న మీ మెయిల్ చదివినప్పటి నుంచి నా పాపాయి నాతో మాట్లాడుతున్నట్టుగా అనిపిస్తోంది! ఒక దిద్దుకోలేని పొరపాటు చేయకుండా నన్ను మీరు రక్షించారు. పవన్‌కీ నాకూ ఉన్న అభిప్రాయభేదాలతో ఈ పాపాయికేం సంబంధం? తనని నా శరీరంలో ఒక భాగంగా భావించి, నా ఇష్టానుసారంగా ప్రవర్తించవచ్చనుకున్నాను. నా శరీరం, నా ఇష్టం అనుకున్నాను! అక్కర్లేని వస్తువుని ఇంట్లోంచి తీసేసినట్టు, ఈ రూపం దిద్దుకుంటున్న పాపాయిని నా శరీరంలోంచి తీసిపారేద్దామనుకున్నాను... క్షణికమైన ఆవేశంలో! నా సమస్యకి ఇదే పరిష్కారం అని నమ్మాను గాని, ఈ పరిష్కారం ఇంకా మాటరాని ఒక చిన్ని ప్రాణాన్ని 'ఇన్వాల్వ్' చేస్తోందని గ్రహించలేదు!

పాపం! ఎంత చిన్నబోయిందో ఆ చిన్నిప్రాణం! భవిష్యత్తులో ఎపుడైనా... నా ఒడిలో పడుకుని ఉన్నపుడో, నాతో ఆటలాడేటపుడో, నేను దగ్గర లేనపుడో... ఎపుడైనా నా యీ ప్రయత్నం గురించి పాపాయికి తెలిస్తే ఎంత తల్లడిల్లిపోతుందో కదా! ఈ ఆలోచన నాకిపుడు కలిగింది! ఇలా ఆలోచిస్తున్నకొద్దీ ఈ పాప నాపైనొక బాధ్యతగా కాక, నాకొక 'ఇమోషనల్ సపోర్ట్'గా అనిపిస్తోంది!

ప్రతిభా ఆంటీ! మీరే నా డాక్టర్ బ్రూనర్!

కృతజ్ఞతలతో...
సుజిత

:·:

★వివరాలకు పక్క పేజీ చూడండి